సాక్షి పల్నాడు

గురువారం । 12 । జూన్ । 2025



పున్నమి గరుడ సేవ

సత్తెనపల్లి: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో పున్నమి గరుడ సేవ నిర్వహించారు.



దేశమ్మ తల్లికి పూజలు

పెదకూరపాడు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా 75 త్యాళ్ళూరు గ్రామదేవత శ్రీదేశమ్మ తల్లికి బుధవారం శ్రీలలిత మహిళా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగేశ్వర స్వామికి పూజలు



చేబ్రోలు: ఏరువాక పౌర్ణమి సందర్భంగా చేబ్రోలులోని నాగేశ్వర స్వామి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. పంటలు బాగా పండాలని స్వామికి పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన చెన్నమల్లేశ్వరుని కల్యాణ వేడుకలు



రేపల్లె: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్రైమాసిక కల్యాణ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూర్ణాహుతి హోమం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, ధాన్యకుట్టునోత్సవం, త్రిశూల స్నానాలు, పవళింపు సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

81 కలశాలతో వేంకటేశ్వర స్వామికి అభిషేకం





తాడేపల్లి రూరల్ : సీతానగరం విజయ కీలాద్రి దివ్యక్షేత్రంపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం 81 కలశాలతో అభిషేకాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో జ్యేష్ఠ నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామి వారికి 81 కలశాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం హయగ్రీవ హోమం, అష్టోత్తర శతనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

జీజీహెచ్‌లో నీటి సరఫరాకు అంతరాయం

– తక్షణమే పునరుద్ధరణ



గుంటూరు మెడికల్: గుంటూరు మున్సిపాలిటీకి చెందిన ప్రధాన 'ఎ' లైన్‌లో నీటి వాల్వ్ మరమ్మతులకు గురైంది. ఈ పైపులైన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లోని ఏడు భవనాలను నీరు సరఫరా అవుతోంది. ఈ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా ఆరు భవనాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండగా, ఒక భవనానికి మాత్రమే తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోయిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి బుధవారం తెలిపారు. విషయం మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయగా 90 నిమిషాల్లోనే వాటర్ ట్యాంకర్‌ను పంపించి ఆ భవనానికి నీటిని అందించారన్నారు. నీటి సమస్య కేవలం మంగళవారం ఒక్కరోజే మాత్రమే తలెత్తిందని తెలిపారు. గత నాలుగు రోజులుగా ఎటువంటి అంతరాయం లేదన్నారు.

కొండవీడు కోటలో యోగా కార్యక్రమం రద్దు



యడ్లపాడు: కొండవీడు కోటలో బుధవారం ఉదయం జరగాల్సిన ప్రత్యేక యోగా కార్యక్రమం అకాల వర్షం కారణంగా రద్దయింది. జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు ఆధ్వర్యంలో టూరిజం, అటవీ శాఖల పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ఘాట్‌రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 గంటల నుంచి గంటన్నరపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా చివరి క్షణంలో రద్దు చేశారు. ఈ నెల 18న అమరావతిలోని జ్ఞాన బుద్ధ ప్రాంతంలో చివరి యోగా కార్యక్రమం జరగనుంది.

ఏడాది పాపాలన!

ప్రజాసంక్షేమం పక్కన పెట్టి వేధింపులకే కూటమి ప్రాధాన్యం

- కూటమి ప్రభుత్వ పాలనలో జాడలేని అభివృద్ధి
- ఏడాదిగా చెప్పుకోదగ్గ ఒక్క పనీ పూర్తి కాని వైనం
- ఆరు నెలల్లో 'వరికపూడిశెల' పూర్తికి హామీ
- ఏడాదైనా తట్టెడు మట్టి కూడా ఎత్తని పాలకులు
- అగమ్యగోచరంగా పిడుగురాళ్ల వైద్య కళాశాల భవితవ్యం
- నరసరావుపేట ఆటోనగర్, క్రిటికల్ కేర్, వినుకొండ ట్రామాకేర్‌లదీ అదే దుస్థితి
- చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నిస్తున్న ప్రజలు
- సూపర్ 6 అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైంది. భారీ ఎత్తున సంబరాలకు పాలకులు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో ఏడాది కూటమి పాలనలో ఏం సాధించారని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధే జరగలేదని ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం చేశారు. తామొస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. కానీ గద్దెనెక్కాక ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను హతమార్చడం, దాడులు చేయడం, అరెస్టు చేయడం మినహా చేసిందేమీ లేదు. సూపర్ సిక్స్ పథకాల ఊసు కూడా లేదని జిల్లా ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మోసాల పాపపు పాలనపై మండిపడుతున్నారు.

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊరూవాడా ఊదరగొట్టారు. ప్రకటించిన మేరకు సూపర్–6 పథకాలైనా అమలయ్యాయా.. అంటే అదీ లేదు. ఏడాదిగా వాటి ఊసు లేదు. కనీసం ఎప్పుడిస్తారో పాలకులకే స్పష్టత లేదు. గత ప్రభుత్వం ప్రారంభించిన పిడుగురాళ్ల మెడికల్ కళాశాల, వరికపూడిశెల పనులు కూడా పూర్తి చేయలేదని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏం సాధించారని విజయోత్సవ ర్యాలీలు చేపడుతున్నారంటూ పల్నాడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సంవత్సరమైనా పట్టింపు శూన్యం

ఏడు దశాబ్దాలుగా పల్నాటి ప్రజల కల వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం. గతంలో ఎంతో మంది నేతలు అనుకున్నా ప్రాజెక్టుకు అవసరమైన అటవీ, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ వంటి కీలక అనుమతులను కేంద్రం నుంచి తేవడంలో సఫలీకృతం కాలేకపోయారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టు అనుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించి కీలక ముందడుగు వేశారు. మొదటి దశ పనులను ప్రారంభించారు. అంతలో ఎన్నికలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు చంద్రబాబు మొదలు స్థానిక నేతల వరకు హామీ ఇచ్చారు. ఏడాదైనా కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని ప్రజలు వాపోతున్నారు.

జిల్లా ప్రజలకు తీరని అన్యాయం

మరోవైపు జలజీవన్ మిషన్, వైఎస్సార్ కరువు నివారణ పథకం వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏడాదైనా జేజేఎం పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు అందించలేదు. నరసరావుపేటలో ఆటోనగర్ ఏర్పాటుకు ఇంకా స్థల సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ పనులు ప్రారంభం కాలేదు. వినుకొండ ట్రామాకేర్ ఏర్పాటు ఎంతో అత్యవసరం. కానీ దాని ఊసే ప్రస్తుత పాలకులు ఎత్తడం లేదు. సాగర్ కాలువలకు మరమ్మతులు చేయలేదు. కీలక జాతీయ రహదారుల పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా నకరికల్లు – వాడరేవు జాతీయ రహదారి భూసేకరణ నేటికీ పూర్తి కాలేదు. మాదిపాడు బ్రిడ్జ్ పూర్తి చేయలేదు.

వైద్యసేవలు దూరం

మరీ ముఖ్యంగా పల్నాడు జిల్లాకే తలమానికమైన పిడుగురాళ్ల మెడికల్ కళాశాల భవితవ్యం కూటమి ప్రభుత్వం వచ్చాక అయోమయంలో పడింది. సుమారు 50 ఎకరాల్లో రూ.500 కోట్లతో కడుతున్న కళాశాల పనులలో కీలక విభాగాలు గత ప్రభుత్వ హయాంలో దాదాపుగా పూర్తికావొచ్చాయి. మిగిలిన అరకొర పనులు పూర్తికి ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. ఎప్పటి నుంచి ఆసుపత్రి సేవలు అందుబాటులోకి వస్తాయి, మెడికల్ విద్యార్థుల అడ్మిషన్లు ప్రారంభమెప్పుడు? వంటి వాటికి సమాధానాలు లేవు. ఈ నేపథ్యంలో ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి ఏంటని కూటమి నేతలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సంక్షేమానికి తూట్లు...

ఎన్నికల ముంగిట అధికారంలోకి వస్తే సూపర్–6 పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీలు ఊరూవాడ తిరిగి ప్రచారం చేశాయి. పీఠం ఎక్కి ఏడాదైనా అమలుకు నోచుకోలేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు.




రెడ్ బుక్ అమలుకే ప్రాధాన్యం..



కూటమి పార్టీలకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరుల ఇళ్లపై కూటమి గూండాలు దాడులు మొదలుపెట్టారు. వందలాది కుటుంబాలు పల్నాడు జిల్లా వదలి వేరే ప్రాంతాలకు వలస వెళ్లి తలదాచుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పోలీసులను అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు వినియోగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, విడదల రజిని, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితర నేతలు సహా సుమారు 390 మంది కార్యకర్తలు, పాతిక మంది సోషల్‌మీడియా యాక్టివిస్టులు, తొమ్మిది మంది జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు దిగారు. వందలాది మందిని జైళ్లపాలు చేసి కక్ష రాజకీయాలు చేస్తున్నారు. పొలిటికల్ బాస్‌లకు పోలీసులు సెల్యూట్ కొడుతున్నారని అపవాదుంది. మరోవైపు కూటమి నేతలు ఏడాదిగా ఇసుక, మట్టి, గ్రానైట్, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో రూ.కోట్లు తమ జేబుల్లో వేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను ఆక్రమించుకుంటున్నారు.

రైతులకు రిక్తహస్తం



టీడీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు అందజేయాలి. ఈ పథకం ప్రకారం పల్నాడు జిల్లాలో ఉన్న 2,80,181 మంది రైతులకు ఏటా రూ.560.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఏడాది గడిచింది. అయినా చంద్రబాబు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ఏకంగా రూ. 1,738.58 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేశారు.

తల్లులకు వెన్నుపోటు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 అందజేస్తామని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరంలో 3,23,711 మంది విద్యార్థులకు ఏడాదికి రూ. 485.56 కోట్లు అందజేయాల్సి ఉంది. రెండో విద్యాసంవత్సరం కూడా ప్రారంభమైంది. ఇప్పటికీ ఎప్పుడిస్తారో స్పష్టత లేదు.

ఉద్యోగం లేదు.. భృతి రాదు..



ఇంటింటికి ఉద్యోగం లేదా ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా నిరుద్యోగుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వ ఏర్పడి ఏడాదైన నేపథ్యంలో జిల్లా ప్రజలకు ప్రభుత్వం సుమారు రూ.2,345.76 కోట్లు బకాయిపడినట్లైంది. అధికారంలోకి రాగానే ఉద్యోగాలు పొందవచ్చని భావించిన యువత పెట్టుకున్న ఆశలు కూడా ఆడియాశలయ్యాయి.

మోసపోయిన మహిళలు



సూపర్–6లో మరో కీలక హామీ 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య గల ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పడం. జిల్లాలోని 7,80,538 మంది మహిళలకు ఏడాదికి ఈ పథకం ద్వారా సుమారు రూ.1,405 కోట్లు అందజేయాల్సి ఉంది. ఇప్పటివరకు నయాపైసా ఇవ్వలేదు.

ఉచిత బస్సుకూ దిక్కులేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని మహిళందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీని ప్రకారం పల్నాడు జిల్లాలో మొత్తం 10,92,752 మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీని వల్ల ఉపాధి, ఉద్యోగాలు, వైద్యం, వివిధ పనులపై నిత్యం బస్సులలో ప్రయాణించే మహిళలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

750 మంది ఎస్జీటీలకు స్థాన చలనం



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న జేడీ శైలజ, గుంటూరు, పల్నాడు డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ తదితరులు

- మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు
- నేడు 750 నుంచి 1,750 వరకు నిర్వహణ



హాజరైన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న 750 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ) వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఉపాధ్యాయుల ఆందోళన ఫలితంగా వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మాన్యువల్ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో బదిలీల ప్రక్రియ చేపట్టింది. సీనియార్టీ జాబితాలోని వరుస క్రమంలో ఒకటి నుంచి 750 వరకూ పేర్లు ఉన్న ఎస్జీటీ (తెలుగు)లను పిలిచిన విద్యాశాఖాధికారులు, పాఠశాలల్లోని ఖాళీలను డిస్‌ప్లే చేసి, ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి రోజు లాంగ్ స్టాండింగ్ విభాగంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో శారీరక వైకల్యం గల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లదలచుకున్న పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళతో పాటు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి పరిశీలకురాలిగా వచ్చిన జేడీ (సర్వీసెస్) పి. శైలజ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్లు రమణ, శైలజ, ఏపీ ఎస్‌డీఎంఏ డీపీఎం ఎ. లక్ష్మీకుమారి, డ్వామా పీడీ వి. శంకర్, ఎంఈవోలు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

వర్షంలోనూ తరలివచ్చిన భక్తజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ బుధవారం ఉదయం జేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని అంగరంగ వైభవంగా కొనసాగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కాగా, ప్రచార రథంపై ఆది దంపతులకు ఆలయ ఈవో శీనానాయక్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రత్యేక వాహనంపై కాకుండా ప్రచార రథంతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రచార రథం ముందుకు సాగగా, భక్తులు అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మొక్కుబడి పనులు

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొలిక్కి రాలేదు. పాఠశాలల్లో నాడు– నేడు పనులు పూర్తి కాలేదు.. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ప్రభుత్వ బడులు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పునఃప్రారంభం కానున్నాయి. పేద విద్యార్థులు ఎక్కువగా చదివే ప్రభుత్వ పాఠశాలలపై చంద్రబాబు సర్కారుకు ఉన్న కపట ప్రేమ మరోసారి నిరూపితం అయ్యేలా ప్రస్తుతం దుస్థితి కళ్లకు కడుతోంది.

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్ణంగా వచ్చిన విద్యా మిత్ర కిట్లు
- యూనిఫాం, బూట్లు, సాక్స్‌లు లేకుండానే పాఠశాలలకు చేరిక
- అసంపూర్తిగా 'నాడు– నేడు' ప్రగతి పనులు
- మొండి గోడలతో దర్శనమిస్తున్న తరగతి గదులు, టాయ్‌లెట్లు

సర్కారు నిర్లక్ష్యంతో విద్యార్థులకు స్వాగతం పలకనున్న సమస్యలు



అసంపూర్తిగా ఉన్న ఓ మున్సిపల్ హైస్కూల్‌లోని తరగతి గదుల నిర్మాణం

నరసరావుపేట ఈస్ట్ : కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా ఉపాధ్యాయులు బదిలీల కోసం పడిగాపులు కాస్తున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో దాదాపు 6,582 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇప్పటికీ 2 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లా పరిధిలో గురువారం 750 మంది ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ ప్రకటించగా, రాత్రి పొద్దుపోయే సమయానికి సగం మందికి కూడా ప్రక్రియ పూర్తికాని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 1,585 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1,46,771 మంది విద్యార్థులు చదువుతున్నారు. బదిలీల పరిస్థితి ఇలా ఉండగా పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానోపాధ్యాయులు బదిలీలపై వేరే పాఠశాలలకు వెళ్లిపోవటంతో అప్పటివరకు పనిచేసిన పాఠశాలల పరిస్థితిని పట్టించుకునే వారే కరువయ్యారు.

కిట్లు.. తప్పని పాట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచిన మొదటిరోజే విద్యాకానుక కిట్లను అందించేవారు. కూటమి ప్రభుత్వం ఇస్తానని చెప్పిన విద్యా మిత్ర కిట్లు మాత్రం బడులకు ఇంకా పూర్తిస్థాయిలో చేరనేలేదు. యూనిఫామ్, షూస్, సాక్స్‌లను పంపించలేదు. త్వరలో నిర్వహించనున్న మెగా పేరెంట్ డే సమావేశాలలో వాటిని పంపిణీ చేసేందుకు ప్రస్తుత కిట్‌లో వాటికి చేర్చలేదనేది విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు..

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పాఠశాలల్లో నాడు– నేడు పనులను పూర్తి చేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాల్సి ఉంది. కానీ కూటమి పాలకుల నిర్లక్ష్యంతో ఆయా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పల్నాడు జిల్లా పరిధిలో రూ.165 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.90 కోట్ల పనులు చేశారు. తొలి దశలో రూ.53.50 కోట్లు, రెండో విడతలో రూ.27.47 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 'నాడు– నేడు' భాగంలో మొదటి దశలో 746 పాఠశాలల్లో పనులు చేపట్టాల్సి ఉంది. 88 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 266 బడుల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మరో 194 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం శ్లాబ్ దశకు, 66 స్కూల్స్‌లో రూఫ్ లెవల్‌కు, 34 పాఠశాలల్లో కిటికీలు, 27 పాఠశాలలు బేస్‌మెంట్ దశలో ఉన్నాయి. మరో 71 పాఠశాలల్లో అసలు పనులు ప్రారంభించలేదు. రెండో దశలో 629 పాఠశాలలకు గాను కేవలం 33 పాఠశాలల్లోనే పనులు పూర్తి చేశారు. చివరి దశలో 153, శ్లాబ్ దశకు 99, కిటికీల దశకు 36, బేస్‌మెంట్ దశకు 40 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 223 పాఠశాలల్లో అసలు పనులే ప్రారంభించని దుస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు చెట్ల కిందే పాఠాలు చెప్పాల్సి వస్తుందని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.



జి.ముప్పాళ్లలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం


కొండపై ఉన్న చెరువులు


కొండపై కట్టడాలకు చేరుకునేందుకు స్వాగత ద్వారం


కొండవీడు కోట

చారిత్రక దర్పం..

ప్రకృతి ప్రేమికుల స్వర్గం


కొండకింద కోట గ్రామంలోని కత్తులబావి.. ఎదురుగా విజయస్థూపం

తూర్పు కనుమలు.. వాటిపై శత్రు దుర్భేద్యమైన కోటలు కొండవీడు ప్రత్యేకత. ఇక్కడి రాళ్లు నాటి రాజుల అశ్వాల గిట్టల సవ్వడిని, మద గజాల ఘీంకారాన్ని విన్నాయి.. అక్కడి ప్రతి చెట్టు రెడ్డి రాజుల పరాక్రమాన్ని చాటుతాయి. ప్రకృతి ఆరాధకులకు ఆనందం పంచుతూ.. సాహస యాత్రికులకు సవాల్ విసురుతూ.. చరిత్ర ప్రేమికులకు అద్భుత ఆకర్షణగా కొండవీడు కోట విలసిల్లుతోంది. కొండపైకి చేరుకునే వంపు సొంపుల మార్గంలో ప్రయాణం అత్యద్భుతం.. దారి పొడవునా ఉండే రకరకాల పూలతోటల సోయగం అమోఘం.

– యడ్లపాడు


ఘాట్‌రోడ్డులో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్

క్లుప్తంగా

నేటి నుంచి జిల్లాలో రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరాలు

నరసరావుపేట: రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ సహకారంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవం, రక్తవర్గాలను కను గొన్న కార్ల్ ల్యాండ్ స్టీనర్ జన్మదినం సందర్భంగా జిల్లాలో ఈనెల 12 నుంచి 19 వరకు వివిధ ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈనెల 12 నాదెండ్ల ఎంపీడీఓ కార్యాలయం, 13న నరసరావుపేట, సత్తెనపల్లి ఎస్‌బీఐ రీజినల్ ఆఫీస్, 17న మాచర్ల, 18న గురజాల, 19న చిలకలూరిపేట ఎస్‌బీఐ కార్యాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్‌పాస్‌ల జారీకి అంతరాయం

నరసరావుపేట: విద్యార్థుల బస్‌పాస్‌లు, ఐడీ కార్డుల రంగులు మార్చడం వల్ల వాటి వివరాలను సిస్టమ్‌లో నమోదుచేయాల్సిన అవసరం ఏర్పడిన కారణంగా ఈనెల 12, 13 తేదీల్లో బస్‌పాస్‌లు జారీచేయబడవని ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.మధు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి 14వ తేదీ నుంచి బస్‌పాస్‌లు జారీ చేస్తామన్నారు. విద్యార్థులు తమ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే వారు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఒక పిన్ పంపబడుతుందని, ఆ పిన్‌ను బస్‌స్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో చూపించడం ద్వారా పాస్‌ను త్వరగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

గిరిజన విద్యార్థులకు అండగా ఉంటాం

రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు అండగా ఉంటుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని పెదతురకపాలెంలో రూ.8.20కోట్లతో నిర్మించిన గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన బోధన, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 240మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పాఠశాల, వసతి భవంతి సర్వాంగ సుందరంగా నిర్మించడం జరిగిందన్నారు. జిలా వ్యాప్తంగా ఏడు హాస్టళ్లను ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన పంపినట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు సంధ్యా రాణి, గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ విజయ్ కుమార్

బెల్లంకొండ: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్‌లో కెపాసిటీకి సరిపడా ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం వినియోగదారులకు సబ్సిడీ అందజేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి నెలరోజుల వ్యవధిలోనే సబ్సిడీ వచ్చే విధంగా విద్యుత్ శాఖ, సోలార్ డిస్ట్రిబ్యూటర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ఒక కిలో వాట్ నుంచి రెండు కిలో వాట్ల వరకు రూ.30 వేల నుంచి రూ.60 వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు కిలో వాట్ నుంచి మూడు కిలో వాట్స్ వరకు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. బ్యాంకుల ద్వారా విద్యుత్ శాఖ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకొని గృహాలకు వినియోగించుకోవడం ద్వారా కరెంట్ బిల్లులు ఆదా చేసుకోవచ్చన్నారు. వినియోగదారులు అదనపులోడును క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

రైతులను ఇబ్బందిపెట్టకుండా రీ సర్వే పనులు

అధికారులకు సూచించిన జేసీ సూరజ్ గనోరే



నరసరావుపేట: రైతుల సమక్షంలోనే కొలతలు, హద్దురాళ్లు, బౌండరీలు సక్రమంగా చేపట్టి ఎవరినీ నొప్పించకుండా రీసర్వే నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించి ఆయా మండలాల్లో జరుగుతున్న సర్వే పనులు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ విషయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దార్, ఏడీ సర్వేయర్‌తో చర్చించాలన్నారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో ఉన్న ఆర్డీఓలు, మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆయా మండలాల సర్వేయర్లు, వీఆర్వోలతో మాట్లాడారు. డీఆర్ఓ ఏకా మురళి, రీసర్వే అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో జిల్లాను ముందంజలో నిలపాలి


ఫుట్‌బాల్ విజేతలతో సుబ్రహ్మణ్యేశ్వరరావు, రంగిశెట్టి తదితరులు

- ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర రావు
- ఫుట్‌బాల్ నియోజకవర్గ స్థాయి పోటీల విజేతలు మాదల, సత్తెనపల్లి

సత్తెనపల్లి: ఫుట్‌బాల్ క్రీడను ముందంజలో నిలపాలని జిల్లా క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యేశ్వర రావు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏప్రిల్ 26 నుంచి నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు బుధవారంతో ముగిసింది. 45 రోజులు పాటుసాగిన ఈ క్యాంపులో 40 మంది బాలికలు, 50 మంది బాలురు పాల్గొన్నారు. ఈ క్రమంలో గత మూడు రోజుల నుంచి బాలబాలికలకు నియోజకవర్గ స్థాయిలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మొత్తం 12 జట్లు హాజరుకాగా బాలుర విభాగంలో మాదల జట్టు ప్రథమ స్థానం, సత్తెనపల్లి జట్టు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో సత్తెనపల్లి ప్రథమస్థానం, మాదల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి .ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. జనసేన నాయకుడు కొత్త రామకృష్ణ, 30వ వార్డు కౌన్సిలర్ సత్తెనపల్లి అనురాధ శ్రీనివాస రావు, ఎకో ఓవర్సీస్ ప్రతినిధి తేజ, వ్యాయామ ఉపాధ్యాయులు ఐఎస్ నాగిరెడ్డి, అచ్చిరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, శ్రీనివాసరావు, నరసింహారావు, రియాజ్, మస్తాన్‌వలి, ఎస్ఎంసీ చైర్మన్ మస్తాన్‌వలి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి



గురజాల: స్థానిక సబ్‌జైలును పదవ అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. ఖైదీలకు వైద్య పరీక్షలు సరిగ్గా జరుగుతున్నాయా లేదా అని వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయవాది లేకపోతే దరఖాస్తు చేసుకుంటే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనవెంట జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, న్యాయవాదులు కోట శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావు, షేక్ జానీబాష తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బియ్యం

నరసరావుపేట: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సంక్షేమ హాస్టళ్లు, సంస్థలు, పాఠశాలల ప్రారంభం నుంచి విద్యార్థులకు ఫైన్ క్వాలిటీ రైస్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బియ్యం సరఫరాచేసే 25కేజీల సంచులకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లాలోని 1527 ప్రభుత్వ పాఠశాలలు, 133 సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు 25కేజీల 18,918 సంచుల్లో సరఫరా చేస్తారన్నారు. గతంలో ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా డీలర్‌కు, అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేసేవారన్నారు. ఇప్పుడు నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పాఠశాలలకు రెండోదశగా రవాణా వాహనాల ద్వారా సరఫరా చేయటం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు, వసతిగృహ అధికారులు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి ఫైన్ క్వాలిటీ రైస్ దిగుమతి చేసుకోవాలని సూచించామన్నారు. నిల్వున్న పాత బియ్యాన్ని నూతన రైస్‌తో కలపకుండా పరిశుభ్రమైన ప్రదేశంలో భద్రపర్చాలన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సునీత



బెల్లంకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గర్నెపూడి సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్ఐఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా బెల్లంకొండ కళాశాలకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ కళాశాలలో ఉత్తమ విద్యా బోధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుంచి ప్రతీ విద్యా సంక్షేమాన్ని విద్యార్థులకు అందేలా చూస్తానని పేర్కొన్నారు. సునీతకు కళాశాల అధ్యాపక సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా ప్రసాద్

నరసరావుపేట: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా యం.వి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ పౌరసరఫరాల సహాయాధికారిగా పనిచేస్తూ బదిలీ పల్నాడు జిల్లాకు వచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి తన జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న నారదముని నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియచేశారు.

ఉద్యానశాఖ జిల్లా అధికారి వెంకటరావు బాధ్యతలు స్వీకరణ

నరసరావుపేట: జిల్లా ఉద్యాన అధికారిగా ఐ.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యాన పంటల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటానని వెంకటరావు పేర్కొన్నారు.